


# కుక్కపిల్ల

— దాశరథి రంగాచార్య

పూలంటే నాకు ఇష్టం. పారిజాతాలంటే మరీ ఇష్టం. చాలా మక్కువ. పారిజాతం మొక్క చాలాసార్లు నాటాం. అంటుకో లేదు. అంటుకుంటే పెరక్కుండానే ఎండిపోయేది. చివరకు కాంపౌండు పక్కన నాటాం. అది అంటుకుంది. గుబురుగా పెరిగింది. పూలువిరగ బూస్తూంది. ఎర్రనికాడ-పల్చని రెక్కలు-లేత సువాసన పారిజాతం అందంగాఉంటుంది. అవి నేలరాలినప్పుడు చూట్టం, వాటిని ఏరడం నాకు సరదా. మీ పారిజాతం చెట్టు మా కాంపౌండు బయటికి గూడా వ్యాపించింది. పూలు రోడ్డుమీద కూడా రాలాయి. వాటిని అంతా ఏరుకుపోతారు. అవీ మా చెట్టుపూలేగా అని నాకు గర్వం. శ్రీమతికి అది నచ్చదు. మన చెట్టుపూలు వేరే వాళ్ళెందుకు తీసుకో వాలి అంటుంది అందుకు కొన్నాళ్ళు కాపలా కూడా ఉంది. ఇరుగు పొరుగు వాళ్ళతో తగాదా కూడా వచ్చింది. అయినా ఆ పూల మీద మమకారం వదులుకోలేదామె. చివరకు ఒక ఉపాయం కనిపెట్టింది. మా పాపను తెల్లారుజామున లేపుతుంది. పూలబుట్ట అందిస్తుంది. ఎవరూ లేవకముందే మా పాపపూలు ఏరి తెస్తుంది. పాపకు కూడా సరదాయే పారిజాతాలంటే !

ఒకనాటి తెల్లారుజామున పాప నన్ను లేపింది. "నాన్నా ! కుక్క పిల్లలు పెట్టింది. ఎంతబావున్నాయనుకున్నావు ! పారిజాతం చెట్టు కింద నాలుగు పిల్లలు పెట్టింది" అని నాలుగు వేళ్ళు చూపింది. నన్నులాక్కెళ్ళింది. మా కాంపౌండు అవతల కుక్కపిల్లలు పెట్టింది. పిల్లలు ముద్దుగా ఉన్నాయి. రెండు నల్లగా ఉన్నాయి. ఒకటి నల్లగా ఉండి తెల్లని మచ్చలది. మరొకటి తలమీద పొట్టమీద నల్లగా ఉంది మిగతా తెల్లగా ఉంది. నాలుగు పిల్లలూ బావున్నాయి. అవి పారిజాతాల్లో ఉన్నాయి. వాటిమీద పారిజాతాలున్నాయి. తల్లి కుక్క నన్ను చూచింది. చెవులు నిక్కపొడిచింది. లేచి నుంచుంది. గుర్రుమంది. దానికళ్ళు మెరుస్తున్నాయ్. గుర్రు గుర్రు మంటూంది. అడుగుముందుకు వేస్తే కొరికేస్తానంటూంది. పాప నా చాటుకు చేరింది. నేను అడుగు ముందుకు వేయలేదు. పాప పారిజాతాలు ఏరలేదు. మేం లోపలికి వచ్చాం. శ్రీమతి గడప కడిగింది, పసుపురాచింది. కుంకంబొట్లుపెడ్తూంది. అలాంటప్పుడు గడపదాటరాదు. దాటితే శ్రీమతి పులి అవుతుంది. అందుకు బయటనే నుంచున్నా.

"ఏవండీ ! కుక్క పిల్లలు బావున్నాయి. సాదుకుందామా ?" అర్థిస్తున్నట్లుగాఅడిగింది. బొట్లు పెట్టడం ఆపి ముంజేతితో ముఖం మీది వెంట్రుకల్ను తొలగిస్తూ తల ఎత్తి నా వైపు చూస్తూ.

ఆవిడకు తెలుసు నా బలహీనత అలా చూస్తే దేనికైనా వప్పుకుంటానని.

"అవున్నాన్నా ! కుక్కపిల్లల్ను సాకుదాం పాపకూడా అడిగింది-రెండుచేతుల్తో పూలబుట్ట పట్టుకొని తలెత్తిచూస్తూ.

నాకు కుక్కలంటే బొత్తిగా ఇష్టంలేదు. కాదు గిట్టదు, వాటికి మనుషుల్ను మించిన విశ్వాసం ఎందుకుండాలి ? కారణం అదని చెప్పలేను. కాని కుక్కలంటే గిట్టదు. అవి కరుస్తాయి, కరిచే కుక్కలంటేనే కాదుఅసలు కుక్కలంటేనే గిట్టదు నాకు. కారణాలెందుకు కుక్కలంటే నాకు గిట్టదు అంతే.

శ్రీమతి చూపులకు ఓడిపోయాను. అవన్నీ చెప్పలేక పోయాను. "చూతాంలే" అని తప్పుకున్నాను. శ్రీమతి చిన్నబుచ్చుకుంది. అది నాకుకాస్త బాధ కలిగించింది. ఆనాడు గేటుదాకావచ్చి సాగనంప లేదు శ్రీమతి. ఏదో వెలితిగానే ఆఫీసుకు వెళ్ళాను. అక్కడ నా మనసులో కుక్కపిల్లలే మసలు తున్నాయి. చిన్నబుచ్చుకున్న శ్రీమతే కనిపిస్తూంది.

సాయంకాలం ఇంటికి వచ్చే వరకు శ్రీమతీ, పాపా గేట్లోనుంచుని ఉన్నారు. "చూశారా పాపం కుక్కపిల్ల చచ్చిపోయింది. తల్లి కుక్క కూర్చొని కన్నీరు కారుస్తూంది. ఏమిటో మమకారం ! నా గుండె కరిగింది, చూళ్ళేకపోయాను. ఇంట్లోకి వచ్చేశాను.

రాత్రి భోజనాలు చేస్తున్నాం. "నాన్నా ! కుక్కపిల్లను సాదుకుందా" మా పాప అంది. శ్రీమతి అనలేదు. అలా నా వైపు చూస్తూ కూర్చుంది. వంకాయకూర చాల బావుందన్నాను. శ్రీమతి మురిసిపోవాల్సింది. ఉహూఁ అలాకాదే ! గబగబా భోజనం ముగించింది. లేచిపోయింది. గ్రహించాను. తాను అడగలేక పాపతో అడిగించింది. అబ్బో ! ఆరాత్రి చాలా టెక్కు చేసింది. కంచిపట్టుచీర కొని

పెడ్తానన్నాను. తనకు పాలపిట్టరంగుది కావాలంది.

పాప పారిజాతాలు ఏరడం మానేసింది. కుక్కఉందిగా చెట్టుకింద. శ్రీమతికి సంతోషంగా ఉంది. ఎంచాతంటే మరెవరూ పూలు ఏరుకపోవడం లేదు. నేను ఆఫీసుకు వెళ్ళేప్పుడు చూస్తాను. నలిగిన పారిజాతాల్లో పడి ఉంటుంది తల్లికుక్క. మూడు పిల్లలూ పాలు తాగుతుంటాయి పిల్లలు చాల సతాయిస్తాయి. లాగుతాయి. కొరుకుతాయి. పీకుతాయి. ఎంత సహనం తల్లికి ! కిక్కురుమనదు. అలాగే పడి ఉంటుంది. పాలన్నీ అయిపోయేదాకా ! తల్లిని మించిన సహనం ఎవరికుంది ?

ఒకనాడు ఇంటికి వస్తుంటే కుక్కపిల్లలూ కనిపించాయి రోడ్డుమీద. అవి ఆటలాడుకుంటున్నాయి. దూరంగా పరుగులు తీస్తున్నాయి. దగ్గరికి వస్తున్నాయి. కొట్లాడుకుంటున్నాయి. పోట్లాడుకుంటున్నాయి. మళ్ళీ కరుస్తున్నాయి. కలుస్తున్నాయి. కుక్కపిల్లలు చూడ్డానికి బాగనిపించాయి ! పిల్లలు అన్నీ బావుంటాయి. పెరిగినప్పుడు చూడాలి. తల్లికుక్క ఎలాఉంది ఎముకల పోగులా ! అది జాతికుక్క కాదు, నాటుకుక్క.

సాయంకాలం ఇంటికి వచ్చాను. కాఫీ అందిస్తూ శ్రీమతి చెప్పింది రెండు కుక్కపిల్లలు చచ్చిపోయాయని. అవికారు కిందపడ్డాయట. పాప మరీ వర్ణించి చెప్పింది. అవికారు చక్రాల కింద పడడం— నలిగిచావడం నా మనసు కలుక్కుమంది. కాఫీతాగలేదు. గబగబా గేటుదగ్గరికి వచ్చి చూచాను. ఒకే కుక్కపిల్ల వంగి కూర్చొని ఉంది. తల్లికుక్క దాని పక్కనే కూర్చుంది. కన్నీరు కార్చడంలేదు- బహుశా ఎండిపోయి ఉంటుంది. దీనంగా. దుఃఖంగా నావేపు చూస్తూంది. నేను చాలా సేపు చూళ్ళేక పోయాను. ఇంట్లోకి వెళ్ళి సిగరెట్టు కాల్చాను. శ్రీమతి అదోలా చూచింది నన్ను. ఆవిడ చూపులు నాకు తెలుసు. ఆవిడ పెదవి ఎక్కువగా కదల్దు. చూపులేమాట్లాడ్తాయి ! ఇప్పుడామె అంటున్నదేమంటేకుక్కపిల్లలు చచ్చాయని. ఆవిడ చూపులు చూడ్డం మానేశాను. పాప చూస్తూంది. పాప అచ్చం తల్లిపోలికే. నాన్న కుక్కపిల్లనుసాదుకుందాం అంటూంది చూపుల్తో. నేను కాఫీ వదిలేశాను. కాని మరో సిగరెట్టు కాల్చాను.

## భగవద్గీతలో ఏముంది ?

"నువ్వురోజూ భగవద్గీతా పాఠశాలకు వెళుతున్నావా ?"

"వెళుతున్నాను"

"భగవద్గీత సంగతి తెలుసా ?"

"ఆ(.... తెలుసును"

"దానిలో ఏముందో చెప్పగలవా ?"

"అన్నీ చెప్పగలను"

"మరయితే చెప్పు చూద్దాం"

"అందులో మా అక్క ప్రేమిస్తున్న అబ్బాయి ఫోటో వుంది. మాఅమ్మ మైసూర్‌పాక్ తయారుచేసే వంట ఫార్ములా వుంది, మా నాన్న-మా అమ్మ గొలుసు తాకట్టుపెట్టిన చీటీ వుంది !"

—చొ


THE
PHONE: 218
# ELLURU RICE MILLERS' ASSOCIATION
ది ఏలూరు రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ - ఏలూరు

**President :**
Gutta Subba Rao
Phone : 837, 17.

**Secretary :**
Madupalli Mallikharjuna Rao
Phone : 9, 829, B. Com.

**Vice-President :**
Toota Venugopala Rao
Phone : 65

**Joint-Secretary**
Pydeti Venkata Krishna Rao
Phone : 353

**Manager :**
A. Suryanarayana, B A.

**Treasurer :**
Ravva Pitchayya
Phone : 244

ELURU
W. G. Dt.
Andhra Pradesh

ఒకనాడు సినిమాకు వెళ్ళాం. సినిమా అయిపోయింది. ఏం బావుండలేదు. చెత్త. అయినా సినిమాలు చూడాల్సిందే. చూడ్డంతోనే విసిగిపోయామా టాక్సీలో బయల్దేరాం. టాక్సీ డ్రైవరు కుర్రాడు. అతడూ సినిమా చూచాడు హుషారుగా ఉన్నాడు. జోరుగా నడిపిస్తున్నాడు కారు. ర్యాష్‌డ్రైవింగ్ రెండుమూడు చోట్ల మనుషులకు పెట్టేవాడే. కాని తప్పిపోయింది. శ్రీమతి దిగులు దిగులుగా చూస్తుంది. నాకూ భయంగానే ఉంది. పాప నన్ను కరచి పెట్టుకొని కూర్చుంది,

కారు ఖర్రుమని ఆగింది. పెద్ద కుదుపు ఇచ్చింది. నాకేదో భయం అయింది మనిషి చచ్చాడనుకున్నా. "ఏమైంది?" అడిగాను. "ఏం లేదు సార్ కుక్క" అని స్టార్ట్ చేసునే ఉన్నాడు. డ్రైవర్ "ఆపు" అని గట్టిగా కేక పెట్టాను. డ్రైవర్ అదురుకొని ఆపేశాడు.

దోరు తెరచి దిగాం చూస్తే తల్లికుక్క కడుపు మీదినుంచి కారుపోయింది. చితికింది. పేగులు బయట పడ్డాయి. కుక్కపిల్ల ఉరికి వచ్చింది. తల్లిచుట్టూ తిరుగుతూంది. తల్లికి ఇంకా కొన ఊపిరి ఉంది. అదినావైపు దీనంగాచూస్తున్నది జాలిగా చూస్తున్నది. కుక్కపిల్ల చూస్తున్నది. నావైపే చూస్తున్నది. నేను ఏడ్చాను. డ్రైవర్ని తిట్టేశాను. అతడు తలవంచుకున్నాడు. వెళ్ళిపోయాడు.

తల్లికుక్క చచ్చిపోయింది రోడ్డుమీద డొక్క ఛితికి.

కుక్కపిల్ల నా కళ్ళల్లో మసల సాగింది. ఏదో నాకు బాధ్యత ఉన్నట్లు ప్రవర్తించ సాగింది.

తల్లికుక్క చూపులు గుర్తుకు వచ్చాయి. అది అలా ఎందుకు చూచింది? ఈ పిల్లను నీకు అప్పగిస్తున్నా అన్నది. ఇహనీదేబాధ్యత అన్నది. అవును అదినాకో బాధ్యతఅప్పగించి పోయింది.

కుక్కపిల్లను చూచాను. ముద్దుగా ఉంది. తలమీద, పొట్టమీద నల్లని మచ్చ మిగతా తెలుపు. దానికళ్ళు మెరుస్తున్నాయి. ఎందుకో అదంటే ముద్దువచ్చింది నాకు. దాన్నిఅందుకున్నాను. ఎత్తుకున్నాను. తలనిమిరాను.

శ్రీమతి కళ్ళు మెరిశాయి.

పాప తన కిమ్మని కుక్కపిల్లనుఎత్తుకుంది.

కుక్కపిల్ల సహితంగా నలుగురం ఇంటివైపుసాగాం.

...—...

